

దసరా రోజు మద్యం కోసం
చలో కొండపోచమ్మ
- గాంధీ జయంతి రోజున దసరా పండుగ
- మద్యం దుకాణాల బంద్
- కొండపోచమ్మ వద్ద భారీ నిల్వలు 6

సంగారెడ్డి కిందిబజార్ చెరువుకట్టపై మిన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

- జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు ..కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ ఊరేగింపు
- విద్యుద్దీపాలతో కిందిబజార్ మహబూబ్‌సాగర్ చెరువుకు కళ
- సంబరాల్లో హైలెట్‌గా నిలిచిన భారీ బతుకమ్మ
- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ జయాచైతన్యరెడ్డి


సద్దుల బతుకమ్మ సంబరాల్లో జగ్గారెడ్డి, నిర్మల, జయాచైతన్యరెడ్డి


దుర్గామాత సన్నిధిలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు, స్థానిక నేతలు

సంగారెడ్డి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని కిందిబజార్ మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి సందడి చేశారు. జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జయాచైతన్యరెడ్డి, కుటుంబసభ్యులు ఇంటి నుంచి బతుకమ్మలతో ఊరేగింపుగా బయల్దేరి వచ్చారు. ఇబ్బందులు తలెత్తకుండా జగ్గారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అష్టాదశ శక్తిపీఠాల ఆధ్యాత్మిక క్షేత్రం
- కొండపాకలో అద్భుత ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఆనంద నిలయం
- ఆవరణలో అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర ఆలయం నిర్మాణం 7



దుర్గాదేవిగా..

మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విజయదుర్గామాత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- కొండపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి)

అటు..ఇటైతే

- ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా స్తబ్దత
- ఆచితూచి అడుగులేస్తున్న ఆశావహులు
- ఈనెల 8న హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూపు
- రిజర్వేషన్లు మారవచ్చంటూ ప్రచారం
- అభ్యర్థుల ఎంపికను వాయిదా వేస్తున్న ప్రధాన పార్టీలు



సిద్దిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓ వైపు స్థానిక సంస్థలు.. మరో వైపు గ్రామపంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనా పల్లెల్లో వాతావరణం స్తబ్దుగానే కనిపిస్తోంది. రిజర్వేషన్లపై పేచీ నడుస్తున్న కారణంగా ఈనెల 8న హైకోర్టు తీర్పు కీలకంగా మారనుంది. తీర్పు వచ్చాకనే రంగంలోకి దిగాలని చాలామంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అందుకే ఆచితూచి అడుగులేస్తూ పోటీ చేయడానికి ముందుకు రావడం లేదు. ప్రధాన పార్టీలు సైతం అభ్యర్థుల ఎంపికను వాయిదా వేస్తున్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాలో విభిన్నమైన పరిస్థితి నెలకొంది. ఎన్నికల షెడ్యూల్, పోలింగ్ తేదీలు, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాలు ఖరారైనప్పటికీ ఆశావహులు మౌనం వహిస్తున్నారు. ఎలాగూ వారం పూర్తి వివరాలు తెలుస్తాయనే కోణంలో ఆలోచిస్తున్నారు. ఇప్పుడే రంగంలోకి దిగితే ఖర్చులు పెరుగుతాయని, ఆ తర్వాత అటు ఇటైతే లబోదిబో అనాల్సి వస్తుందని వెనక్కు తగ్గారు.

వారం తర్వాతే అభ్యర్థుల ఎంపిక

ఇప్పటికే జడ్పీ చైర్మన్‌తోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ప్రకటించారు. సిద్దిపేట జడ్పీచైర్మన్ పదవిని బీసీ జనరల్‌కు, సంగారెడ్డిని ఎస్సీ

మిగతా 8వ పేజీలో

ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఓటర్ల వివరాలు

జిల్లా	మహిళలు	పురుషులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
సిద్దిపేట	3,34,186	3,21,766	6,55,958	4,508
సంగారెడ్డి	3,75,843	3,68,270	7,44,157	5,370
మెదక్	2,71,787	2,51,532	5,23,327	4,220

పంచాయతీలు, పరిషత్‌ల వివరాలు

జిల్లా	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	పంచాయతీలు	వార్డులు
సిద్దిపేట	230	26	508	4,508
సంగారెడ్డి	261	25	613	5,370
మెదక్	190	21	492	4,220


సిద్దిపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

దసరా ఏర్పాట్లు పటిష్ఠం

- సిద్దిపేట, గజ్వేల్ ఏసీపీల పరిశీలన

సిద్దిపేటకల్చరల్/సిద్దిపేట అర్బన్/ గజ్వేల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రజలు ఆనందోత్సవాల మధ్య పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు సిద్దిపేట, గజ్వేల్ పరిధిలో అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్, పోలీస్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు దసరా ఉత్సవాలు, రావణ దహనం కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు.

సిద్దిపేటలో ఏర్పాట్ల పరిశీలన

సిద్దిపేట పట్టణ శివారులోని రంగధాంపల్లి చౌరస్తా హనుమాన్ టెంపుల్, నర్సాపూర్ గ్రామ శివారు హనుమాన్ టెంపుల్, సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా హనుమాన్ టెంపుల్ వద్ద రేపు నిర్వహించనున్న దసరా వేడుకలు, రావణ దహనంకు సంబంధించిన ఏర్పాట్లను సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మాజీ చైర్మన్ కడవెరుగు రాజనర్సు, కౌన్సిలర్‌లు నాయిని చంద్రం, వంగ తిరుమల్ రెడ్డి, డీఈఈ ప్రేరణ, ఏఈఈలు పృథ్వీ, శ్రీనాథ్ పరిశీలించారు. గజ్వేల్ పట్టణంలో నేడు జరగనున్న బతుకమ్మ పండుగ సందర్భంగా ఏసీపీ కోణం నర్సింలు పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్‌లోని ఊర చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే దసరా సందర్భంగా మహంకాళీ అమ్మవారి ఆలయం వద్ద జరిగే రావణ దహనం కార్యక్రమాల పరిసర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.


సిద్దిపేటలోని జీజీహెచ్ ఆసుపత్రిలో పేరుకుపోయిన హానికర చెత్త

జీజీహెచ్ కంపు కంపు

- పేరుకుపోతున్న హానికర చెత్త
- రోగుల ప్రాణాలకు ముప్పు!
- లోపించిన పారిశుధ్య నిర్వహణ
- ఆసుపత్రి పరిసరాల చుట్టూ దుర్గంధం
- అక్కడే భోజనం చేస్తున్న రోగుల సహాయకులు

సిద్దిపేట సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని, ఆరోగ్యంగా ఉండవచ్చని అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం వారే ఆ మాటలను విస్మరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ లోపించి డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే డెంగీతో మరణించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి సమయంలో, ఏదైనా రోగం నయం చేసుకోవడానికి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే... ఇక్కడ అంటువ్యాధులు, ఇతర రోగాలు సోకేలా పరిస్థితి తయారైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) అనుబంధ మెడికల్ కళాశాలలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఎప్పటికప్పుడు తరలించాల్సిన హానికర చెత్తను కొన్ని రోజులుగా సిబ్బంది తీయకపోవడంతో, ఆసుపత్రి ఆవరణలోనే కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి కాస్తా డంపింగ్ యార్డును తలపించేలా దర్శనమిస్తోంది.

నిత్యం వందలాది మంది జీజీహెచ్‌కు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో గత ప్రభుత్వంలో మాజీమంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేటలో 300 లో పడకల ఆసుపత్రిని అన్ని రకాల సౌకర్యాలు, వసతులతో ఏర్పాటు చేశారు. దీంతో సిద్దిపేట జిల్లా నుంచే కాక, ఇతర జిల్లాల పరిసర గ్రామాల ప్రజలు కూడా వైద్య చికిత్సల కోసం ఈ జీజీహెచ్‌కే వస్తున్నారు. ప్రతిరోజూ వెయ్యి మందికి పైగా రోగులు అవుట్ పేషెంట్‌గా తమ పేరును నమోదు చేసుకుంటున్నారు. అత్యవసరమైన వారికి ఇన్ పేషెంట్‌గా అడ్మిట్ చేసుకొని చికిత్స అందిస్తున్నారు.

కుప్పలుగా హానికర వ్యర్థాలు

ఆసుపత్రిలో రోగులకు చికిత్స అందించే క్రమంలో బ్లడ్ శాంపిళ్లు, మూత్ర పరీక్షల కోసం సేకరించిన నమూనాలు, ఉపయోగించిన ఇంజక్షన్లు, రక్తంతో తడిసిన దూది (కాటన్) వంటి హానికర వ్యర్థాలు (బయోమెడికల్ వేస్ట్) వెలువడుతున్నాయి. ఈ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సదరు అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుండటంతో రోగుల సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఆసుపత్రిలోని హానికర చెత్తను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి, ఆసుపత్రి ఆవరణలోనే పడవేస్తున్నారు. రోగుల బంధువులకు భోజన వసతి సౌకర్యం లేకపోవడంతో వారక్కడే కూర్చొని తింటున్నారు. రోజులు దాటినా చెత్తను తొలగించకపోవడంతో, ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపు వెళ్లిన వారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

జరిమానా విధించినా మారని తీరు

జీజీహెచ్ ఆసుపత్రిలో పేరుకుపోతున్న హానికర చెత్తను బుస్సాపూర్ డంపింగ్ యార్డుకు

మిగతా 8వ పేజీలో

రేవంత్‌రెడ్డి ఓ గజిని

- అబద్ధపు హామీలతో ప్రజల గొంతు కోశారు
- కాంగ్రెస్ బాకీ కార్డే బీఆర్ఎస్‌కు బ్రహ్మాస్త్రం, వారికి ఉరితాడు : మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రజనీకాంత్‌లాగా డైలాగ్‌లు చెప్పి, అధికారంలోకి రాగానే గజినీలా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అబద్ధపు హామీలతో ప్రజల గొంతు కోశారని మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండేళ్లగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమేమి బాకీ పడిందో వివరించేలా రూపొందించిన బాకీ కార్డును (ఫ్లెక్సీ) ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, మహిళలకు, రైతులకు, ఒక్కొక్క ఇంటికి ఏం బాకీ పడిందో తెలిపేలా ఈ బాకీ కార్డు విడుదల చేశామని హరీశ్‌రావు తెలిపారు. రైతుబంధు కౌలు రైతులకు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీల అమలు గురించి ఎవరైనా అడుగుతారేమోనని రాహుల్‌గాంధీ తెలంగాణ ముఖం చూడటం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు యూరియా బస్తాలు ఇచ్చే తెలివి లేదు కానీ, ఊరూరా మద్యం దుకాణాలు, మైక్రో బ్రేవరీలు, బెల్ట్ షాపులు పెట్టి మొత్తానికి తాగుబోతుల తెలంగాణ చేస్తాననడం దారుణమన్నారు. గ్యారంటీలకు టాటా చెప్పి లంక బిందెల కోసం వేటాడుతున్నాడని, అందుకే గచ్చిబౌలి, బంజారాహిల్స్ జూబ్లీహిల్స్‌లో భూములను అమ్ముతానని బయలుదేరారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని డిమాండ్ చేశారు. ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి నరకమంటే మాటలు బాగా నరుకుతారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్లయినా వాటిని అమలు చేయడం లేదని, ఏమేమి బకాయి పడిందో తెలిసేలా బాకీ కార్డును ప్రజలకు అందజేయాలని సూచించారు


కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు


దరఖాస్తు చేసుకుంటున్న ఆశావహులు

ఆశావహుల నుంచి
దరఖాస్తుల స్వీకరణ

చేర్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లకు అనుగుణంగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు చేర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు సంబంధించిన పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులను ఆహ్వానించి ఏయే స్థానానికి ఎవరెవరు పోటీ చేయనున్నారనే అంశంపై లిఖితపూర్వక దరఖాస్తులను స్వీకరించారు. పార్టీలో వారి క్రియాశీల పాత్ర, స్థానిక వ్యవహార శైలి, ఆర్థిక సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం వెల్లడిస్తారు.

తాళం పగులకొట్టి చోరీ

● 65వేల నగదు, ఐదుతులాల వెండి అపహరణ

నర్సాపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి ఊరు వెళ్తే ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంట్లో దూరి 65వేల నగదు, ఐదుతులాల వెండి నగలు అపహరించారు. ఈ ఘటన నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన పెద్ద సురేష్ నర్సాపూర్‌లోని శ్రీనివాస వైన్స్ వెనుకబాగాన ఉండే డి.మల్లేశ్ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. 29వ తేదీన మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి తమ స్వగ్రామంలో నిర్వహించే బతుకమ్మ పండుగకు కుటుంబీకులు అంతా వెళ్లారు. మరుసటి రోజు మంగళవారం ఉదయం ఇంటి యజమాని మల్లేశ్ అద్దెకు ఉంటున్న ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించి సురేష్‌కు సమాచారమిచ్చాడు. సురేష్ స్వగ్రామం నుంచి వచ్చి ఇంట్లో వెళ్లి చూడగా బీరువా అంతా చిందరవందర చేసి అందులో ఉన్న 65వేల నగదు, ఐదుతులాల వెండి నగలు అపహరించినట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారమివ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్ షాప్‌పై దాడి

నిజాంపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం అమ్ముతున్న ఓ బెల్ట్ షాప్‌పై పోలీసులు దాడి చేశారు. నిల్వ ఉంచిన 64 లీటర్ల మద్యాన్ని స్వాధీనపరచుకున్నారు. నిజాంపేట మండల పరిధి కల్వకుంటలో మంగళవారం ఎస్సై రాజేష్ నేతృత్వంలో పోలీసులు దాడులు చేయగా.. నలుగురి ఇళ్లల్లో మద్యం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తడ్కల్‌లో గోవుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ప్రజలు

అశ్రునయనాయలతో గోమాతకు అంత్యక్రియలు

కంగ్టి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తడ్కల్‌లో అనారోగ్యంతో మృతి చెందిన గోమాతకు మంగళవారం దళిత వాడలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి గోమాతపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. దళిత వాడ ఎస్సీ వర్గానికి చెందిన చిన్నగంగారాంకు చెందిన ఆవు అనారోగ్యంతో మృతి చెందగా డప్పు వాయిద్యాలతో గోమాతను ఊరేగించి బాదాతప్త హృదయాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బాధ్యులు డేవిడ్, గంగారాం, రాజు, రాములు, సల్మాన్, సాయిలు, మోజేస్, పోచయ్య, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

దసరా రోజు మద్యం కోసం .. చలో కొండపోచమ్మ

● గాంధీ జయంతి రోజున దసరా పండుగ

● మద్యం దుకాణాల బంద్

● కొండపోచమ్మ వద్ద భారీ నిల్వలు



దసరా రోజున వైన్స్ బంద్ ఉంటుందని బ్యానర్ ఏర్పాటు చేసిన నిర్వాహకులు

జగదేవపూర్: సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ సారి గాంధీ జయంతి రోజున దసరా పండుగ వస్తున్న సందర్భంగా చుక్కా, ముక్కా దొరకదని అనుకుంటున్నారా.. వైన్స్‌లన్నీ బంద్, మటన్ చికెన్ దుకాణాలన్నీ బంద్ పెడుతారు కదా.. ఈ చుక్కా ముక్కా ఎక్కడ అందుబాటులో ఆలోచన చేస్తున్నారా..అవన్నీ కావాలంటే ఛలో కొండపోచమ్మ..అక్కడకు పోతే చాలు..చుక్కా ముక్కా అన్నీ రెడీ, అన్నీ అందుబాటులో ఉంటాయి. అందుకు వైన్స్ నిర్వహకులు భారీ మద్యం నిల్వకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జగదేవపూర్ మండలంలో మొత్తం నాలుగు వైన్స్ దుకాణాలు ఉన్నాయి. మూడు వైన్స్ దుకాణాలు మండల కేంద్రమైన జగదేవపూర్‌లో ఉండగా ఒకటి కొండపోచమ్మ ఆలయం వద్ద ఉంది. మద్యం అమ్మకాల్లో జిల్లాలోనే కొండపోచమ్మ వైన్స్ ప్రథమ స్థానంలో ఉంది. కొండపోచమ్మ ఆలయం ఉండడం వల్ల భక్తులు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ఇక్కడే మందు, విందుతో భోజనాలు చేస్తారు. అంతే కాకుండా సంక్రాంతి పండుగ నుండి ఉగాది వరకు కొండపోచమ్మ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఆలయ పరిసర ప్రాంతంలో ప్రతి కిరాణ దుకాణంలో మద్యం అమ్మకాలు కొనసాగిస్తారు. మరికొన్ని దుకాణాలు బెల్టుషాపులుగా కొనసాగుతున్నాయి.

ఈ సారి గాంధీ జయంతి రోజున దసరా పండుగ రావడంతో ప్రభుత్వం మద్యం, మాంసం విక్రయాలు చేయవద్దని ఇప్పటికే ఆదేశించింది. దాంతో వైన్స్ నిర్వహకులు ముందు జాగ్రత్తగా భారీ స్థాయిలో మద్యాన్ని నిల్వ చేసేందుకు ప్రణాళిక చేసి దొంగచాటున విక్రయాలు చేసేందుకు ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు ఆటు వైపు కన్నేస్తారా.. లేదా అనేది వేచి చూడాలి మరి.!

కుంటలో మునిగి ఇద్దరు మృతి

పటాన్‌చెరు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుంటలో మునిగి ఇద్దరు బాలురు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాచెరు పరిధిలోని బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ఈదులనాగులపల్లి రెండు పడకల గదుల సముదాయంలో ఉంటున్న ఎండీ ఖలీల్ (16), ఎండీ గౌస్ (17) తల్లిదండ్రులతో ఉంటూ చదువుకుంటున్నారు. మంగళవారం కుమ్మకుంట వద్దకు కుటుంబాల సమేతంగా ఆటవిడుపుకు వెళ్లారు. నీటిలో ఆడుకోవడానికి కుంటలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి బయటకు రాలేకపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను వెలికి తీసి పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి పంపారు. వారి తల్లి ఫర్వీన్‌బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వేరు వేరు సంఘటనలతో ఇద్దరు..

ములుగు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో చెరువులో పడి మృతి చెందిన సంఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.మండల పరిధిలోని కొక్కొండ గ్రామానికి చెందిన యాదగిరి (30) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసై వృత్తిని కూడా వదిలేశాడు. తాగి బైక్ పై ఎక్కడికో వెళ్లి తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు అంతటా వెతికిన జాడ కనిపించలేదు. గ్రామ సమీపంలోని యాదగిరి ఇద్దరు కుమార్తెలు వెతకగా బండ చెరువు సమీపంలో మృతుడి చెప్పులు, దుస్తులు, బైక్ ఉన్నాయని కుమార్తెలు తల్లికి తెలిపారు. అక్కడికి వచ్చిన మహేష్, నరసింహులు చెరువులో వెతకగా యాదగిరి శవం బయటపడింది మృతుడి భార్య విజయ తెలిపింది. విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రమైన ములుగు గ్రామంలో బక్క స్వామి నరసింహుడికి మనుశ్రీ అనే 17 నెలల పాప ఉంది. తను ఇంటి ముందర ఆడుకుంటుండగా అదే సమయంలో అటుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ వాహనము మనుశ్రీని ఢీ కొట్టింది. దీంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన గురించి బక్క స్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

● కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



బి.లక్ష్మినారాయణ(ఫైల్)

నారాయణఖేడ్/నర్సాపూర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న లక్ష్మినారాయణ(55) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించాడు. నారాయణఖేడ్‌కు చెందిన లక్ష్మినారాయణ గత 30 ఏళ్లుగా నర్సాపూర్‌లోనే స్థిరపడి ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఆయనకు ఒక కుమారుడు, కూతురు. మంగళవారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో ఛాతిలో నొప్పిగా ఉందని అనడంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబీకులు వెంటనే తీసుకురాగా డాక్టర్ పరిక్షించి అప్పటికే చనిపోయినట్లు ధృవీకరించారు. ఆయన మృతి పట్ల మిత్ర సొసైటీ సభ్యులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి కూడా నర్సాపూర్ వచ్చి మృతదేహనికి నివాళి అర్పించి కుటుంబీకులను ధైర్యం చెప్పారు. నారాయణఖేడ్ ప్రాంతంలో పదిహేను రోజులుగా ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులు గుండెపోటుతో మృతి చెందడం కలకలం రేపుతుంది.

విద్యుదాఘాతంతో రైతు..

దుబ్బాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోళ్లఫారంలో కోడిపిల్లలు ఉంచేందుకు వెళ్లిన ఓ రైతు మంగళవారం రాత్రి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మండలం రఘోత్తంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంతుల రాజమల్లయ్య (58) నాలుగు ఎకరాల స్థలంలో వ్యవసాయ సాగు చేస్తూ, కోళ్లఫారాన్ని నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి కంపెనీ నుంచి కోడిపిల్లలు వచ్చాయి. వాటిని కోళ్లఫారంలో చేర్చడానికి రాజమల్లయ్య వెళ్లాడు. అదే సమయంలో విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్ (సింగిల్‌పేజ్) వద్ద విద్యుత్ దీపం చెడిపోవడంతో సరిచేసేందుకు వెళ్లాడు. దాని వైరు తెగిపడటంతో రాజమల్లయ్య విద్యుత్‌షాక్‌కు గురై, అక్కడిక్కడే మృతి చెందాడు.

హత్య కేసు తనపైకి వస్తుందని.. మంజీరా నదిలో దూకి ఆత్మహత్య



అల్లె లోకచంద్ర (ఫైల్)

పుల్‌కల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాను నిర్వహిస్తున్న లాడ్జీలో ఒకరు అనుమానాస్పదంగా మృతి చెందడం, కుటుంబ కలహాలు వెరసి ఓ యూట్యూబర్ మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కారులో వచ్చిన అతను బ్రిడ్జిపై ఆపి, నదిలో దూకుతున్న దృశ్యాలు సీసీ కెమెరాకు చిక్రాయి. సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం శివంపేట సమీపంలో మంజీరా వంతెనపై మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. జోగిపేటకు చెందిన అల్లె లోకచంద్ర (31) కొంతకాలం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేశారు. తర్వాత క్లింకార యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు. లోకచంద్ర మంగళవారం ఇంటి నుండి తన కారులో బయలుదేరి శివంపేట సమీపంలోని మంజీరా నది వంతెన వద్దకు చేరుకుని కారులో నుండి కిందకు దిగి నదిలో దూకుతున్న దృశ్యం ఎన్‌హెచ్‌ఏఐ సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ ఘటనను చూసిన పలువురు కారును ఫోటోను తీసి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. మంజీర నదిలో దూకి గల్లంతైన యువకుడు జోగిపేట పట్టణంలోని ఇందిరానగరల్ కాలనీకి చెందిన అల్లె లోకచంద్ర (31)గా ఆచూకీ లభించింది. సింగూరు ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భారీ వరద వస్తుండటంతో 11 క్రస్ట్‌గేట్లు ఎత్తారు.సంగారెడ్డి సమీపంలోని మంజీర జలాశయం 8 క్రస్ట్‌గేట్లు ఎత్తారు. నది ప్రవాహంలో దూకి గల్లంతైన లోకచంద్ర ఆచూకీ లభించడం కష్టతరంగా మారింది. శివంపేట వద్ద మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆ వరద నీటి ప్రవాహంలో దూకి గల్లంతవడంతో లోకచంద్ర ఆచూకీ లభ్యం గగనంగా మారింది. స్థానికులు పుల్కల్ ఎస్సై విశ్వజన్‌కు సమాచారం అందించగా, హుటాహుటినా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ బృందాన్ని రప్పించారు. ఎయిర్ బోట్ల సహాయంతో గల్లంతైన వ్యక్తి కోసం మంజీర నది పరివాహక ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి పొద్దుపోయే దాక గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ, ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను నిలిపివేశారు. మృతుడికి భార్య ప్రియ, రెండేళ్ల పాప ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భయంతోనే ఆత్మహత్య

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కలెక్టరేట్ ఎదురుగా చంద్రాస్ లాడ్జీని అల్లె లోకచంద్ర నిర్వహిస్తున్నాడు. ఆ లాడ్జీలో చౌటకూర్ మండలం వెండికోలు గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మణ్ (36) గత నెల 28వ న అనుమానస్పదంగా మృతి చెందారు. ఈ కేసులో లోకచంద్ర ప్రత్యక్ష సాక్షిగా సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మణ్ మృతి కేసు తన మీదకు వస్తుందేమోనని లోకచంద్ర తీవ్ర వేదనకు గురైనట్లు సమాచారం. అలాగే, అతనికి కుటుంబ కలహాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మంజీరా నదిలో దూకి ఆత్మహత్య పాల్పడినట్లు తెలుస్తోంది.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

● పూజలు చేసిన జిల్లా ఎస్పీ పంకజ్



ఆయుధ పూజ చేస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయుధ పూజ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. పోలీసు కార్యాలయంలో ఆయుధాలకు, పోలీసు వాహనాలకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షించడంలో, నేరాలను నియంత్రించడంలో జిల్లా పోలీసులు సఫలీకృతం అవ్వాలని దుర్గామాతను కోరుకున్నట్టు తెలిపారు. స్థానిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకొనేలా దుర్గామాత కరుణ, కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సిహెచ్.రఘునందన్‌రావు, డిఎస్పీ సత్తయ్యగౌడ్, ఏఆర్ డిఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, డానియల్, ఇన్స్‌పెక్టర్ రమేష్ ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా షాపింగ్‌తో కిటకిటలాడిన సంతలు

తూప్రాన్/నారాయణఖేడ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా షాపింగ్‌తో మంగళవారం నారాయణఖేడ్ సంత జనసందోహంతో కిక్కిరిసింది. తూప్రాన్ మండల వ్యాప్తంగా బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుండటంతో బంతి పూలకు డిమాండ్ అధికమైంది. తూప్రాన్ పట్టణంలో మంగళవారం వారపు సంత నిర్వహించగా, సద్దుల బతుకమ్మ పండుగకు అవసరమైన పూల కొనుగోళ్లలో ప్రజలు నిమగ్నమయ్యారు. బంతి, గునుగు, పట్టుకుచ్చుల పూలు అమ్మకానికి వచ్చాయి. అయితే, గునుగు, తంగేడు పూలు లభించకపోవడంతో బంతి పూల ధర అమాంతం పెరిగింది.



ఖేడ్ సంతలో కిక్కిరిసిన జనాలు

కాలుష్యకారక కర్మాగారం వద్దే వద్దు

● కర్మాగారం ఏర్పాటును విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం




రసాయన కర్మాగారం ఎదుట ఆందోళనచేస్తున్న గ్రామస్థులు

జహీరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం, పర్యావరణం, భూగర్భజలాలు తదితరాలపై ప్రభావంచూపే కాలుష్యంకారక కర్మాగారం ఏర్పాటు చేయొద్దంటూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) గ్రామసమీపంలోగల ఐదు గ్రామాల రైతులు, ప్రజలు మంగళవారం ఆందోళనకు దిగారు. కొంత కాలంగా గ్రామశివారులో కర్మాగారం ఏర్పాటు జరుగుతున్న విషయాన్ని గమనిస్తున్నామని, పైగా ప్రజారోగ్యాలతో చెలగాటమాడే కర్మాగారం ఏర్పాటు చేయడం వల్ల ముున్ముందు ఇబ్బందులు పడాల్సివస్తుందని గుర్తుచేశారు. ఈ పాటికే తమ గ్రామసమీపంలో ఏర్పాటుచేసిన చక్కెరకర్మాగారం వెదజల్లే వ్యర్థాలతో ఇబ్బందులు పడ్డామన్నారు. కర్మాగారం ఏర్పాటును విరమించుకోవాలని ఈ సందర్భంగా వారు కర్మాగారం అధికారులను నాయకులను హెచ్చరించారు.


శాంకరిదేవి కంచి కామాక్షి శృంఖలాదేవి చాముండేశ్వరిదేవి జోగులాంబాదేవి భ్రమరాంబికాదేవి మహాలక్ష్మీదేవి ఏకవీరికాదేవి మహాంకాళిదేవి

అష్టాదశ శక్తిపీఠాల ఆధ్యాత్మిక క్షేత్రం


అష్టాదశ శక్తిపీఠ దేవాలయం

- కొండపాక ఆనంద నిలయంలో కొలువుదీరిన అమ్మవార్లు
- అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర ఆలయం
- దేశంలోని తొలిసారిగా ఇక్కడ ప్రతిష్ఠ

కొండపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి కాశ్మీర్ వరకు విస్తరించి ఉన్న అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవడం భక్తులకు ఒక అదృష్టంగా భావిస్తారు. అయితే, ఈ పవిత్ర దర్శనం అందరికీ సులభంగా సాధ్యమయ్యే విషయం కాదు. అందుకే, ఆ తల్లి అనుగ్రహాన్ని భక్తులందరికీ దగ్గర చేసేందుకు తెలంగాణ రాష్ట్రంలో వెలసిన దివ్యధామమే అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం. ఇది ఎక్కడో కాదు, సిద్దిపేట జిల్లాలోని కొండపాక ఆనంద నిలయం ఆవరణలో ఏర్పాటై, నేడు ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రపంచంలోని దేవాలయాలు, జీవనదులన్నింటినీ కలిసి దర్శించుకున్న పుణ్యఫలం ఈ దేవాలయ దర్శనంతో కలుగుతుందని పుష్పగిరి పీఠాధిపతులు విద్యా శంకర భారతి స్వామి అన్నట్టుగా, కొండపాకలోని ఈ ఆలయం దినదిన ప్రవర్తమానంగా వెలుగొందుతోంది. ఈ ఆలయంలో 2023 నవంబరు 25న ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. అప్పటి నుంచి భక్తులు రోజురోజుకూ పెరుగుతూ, దేశ విదేశాల్లో ఉన్న అష్టాదశ శక్తి పీఠాల దర్శనం చేసుకున్న అనుభూతిని పొందుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని, ఆర్థిక భారం లేదా శరీర సహకారం లేని భక్తులకు ఈ దేవాలయం దర్శనభాగ్యం కలగడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావించవచ్చు. సిద్దిపేట జిల్లా వాసులే కాకుండా, రాష్ట్రం నలుమూలల నుంచి అష్టాదశ శక్తిపీఠ అమ్మవార్లను దర్శించుకోవడం కోసం వచ్చే భక్తుల రద్దీ రోజురోజుకూ అధికమవుతోంది.


దేవాలయంలోని ఉమా రామలింగేశ్వర స్వామి

ఆరు కోట్ల వ్యయంతో నిర్మాణం

అష్టాదశ శక్తి పీఠాలన్నింటినీ ఒకే చోట ప్రతిష్ఠిస్తూ ఆలయ నిర్మాణం పూర్తయింది. సుమారు 6 కోట్ల రూపాయల వ్యయంతో వాస్తు కళా నైపుణ్యంతో ఈ ఆలయాన్ని ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందేలా నిర్మించారు. అష్టాదశ శక్తి పీఠాలతో పాటు, రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను కూడా ఇక్కడ నిర్మించారు.

దర్శన వేళలు..

అష్టాదశ శక్తిపీఠ దేవాలయంలో ప్రతి పౌర్ణమికి చండీ హోమం, ప్రత్యేక ఉత్సవాలు, ప్రతి నెలా అభిషేకాలు జరుగుతాయి. పండుగ పర్వదినాల రోజుల్లో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. దర్శన వేళలు ప్రతి రోజు ఉదయం: 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, సాయంత్రం: 4.30 నుంచి రాత్రి 8.00 వరకు ఉంటుంది.

అష్టాదశ శక్తి పీఠాలు..

శాంకరి దేవి	శ్రీలంక (ట్రింకోమలి)
కంచి కామాక్షి	తమిళనాడు (కంచి)
శృంఖలా దేవి	ద్వారక, కలకత్తా (గంగాసాగర్)
చాముండేశ్వరి దేవి	కర్ణాటక (మైసూరు)
జోగులాంబ దేవి	ఆంధ్రప్రదేశ్ (అలంపురం)
భ్రమరాంబికా దేవి	ఆంధ్రప్రదేశ్ (శ్రీశైలం)
మహాలక్ష్మీ దేవి	మహారాష్ట్ర (కొల్హాపురం)
ఏకవీరికా దేవి	మహారాష్ట్ర (మహోర్)
మహాంకాళి దేవి	మధ్యప్రదేశ్ (ఉజ్జయిని)
పురుహూతికా దేవి	ఆంధ్రప్రదేశ్ (పిఠాపురం)
గిరిజా దేవి	ఒడిస్సా (వైతరణి)
మాణిక్యాంబ దేవి	ఆంధ్రప్రదేశ్ (ద్రాక్షారామం)
కామరూపిణి దేవి	అస్సాం (కామాఖ్య)
మాధవేశ్వరి దేవి	ఉత్తరప్రదేశ్ (ప్రయాగ)
వైష్ణవి దేవి	హిమాచల్ ప్రదేశ్ (కాంగ్రా)
మాంగల్య గౌరీ దేవి	బీహార్ (గయ)
విశాలాక్షి దేవి	ఉత్తరప్రదేశ్ (కాశీ)
సరస్వతి దేవి	కాశ్మీర్ (లాల్చౌక్)

సేవా కేంద్రంగా విలసిల్లుతోంది



ఆనంద నిలయం ఆధ్యాత్మిక, సామాజిక సేవా కేంద్రంగా విలసిల్లుతోంది. ఆ తల్లి అనుగ్రహం అందరికీ అందడం కోసమే అష్టాదశ శక్తి పీఠం ఏర్పాటైంది. అందరి సహకారంతో, దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి, ఆర్థిక భారం పడలేని వారికి ఈ దేవాలయం దర్శన భాగ్యం కలగడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావించవచ్చు. విశాలమైన, ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం ఒక మహా అదృష్టం.

-ఆనంద నిలయం చైర్మన్ కె. వి. రమణాచారి (రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి)


పురుహూతికాదేవి గిరిజాదేవి మాణిక్యాంబదేవి కామరూపిణీదేవి మాధవేశ్వరీదేవి వైష్ణవిదేవి మాంగల్యగౌరీదేవి విశాలాక్షి దేవి సరస్వతిదేవి

నాడు ఒకటే.. నేడు పదుల సంఖ్యలో..

- చేర్యాలకు దేవీ నవరాత్రుల శోభ


చావిడి వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న దేవీస్నేహయూత్ సభ్యులు

చేర్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణం దేవీనవరాత్రుల శోభను సంతరించుకుంది. గతంలో పట్టణంలోని అతి పురాతనమైన మహామ్మాయి దేవాలయంలో మాత్రమే నవరాత్రులు నిర్వహించేవారు. కానీ, 23 ఏళ్ల క్రితం స్థానిక చావిడి వద్ద దేవీ స్నేహయూత్ అసోసియేషన్ సభ్యులు ఆరుబయట మండపంలో దేవీనవరాత్రులకు బీజం వేశారు. స్థానికుల దరి సహకారంతో నేటికీ నిర్విఘ్నంగా నవరాత్రులు కొనసాగిస్తున్నారు. భవానీ మాలలకు శ్రీకారం చుట్టారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర వర్గాలు సైతం నవరాత్రులు నిర్వహిస్తున్నారు. నాడు ఒకటి దుర్గాదేవి మండపం ఉండగా, నేడు ఆ సంఖ్య 12కు పైగా చేరుకుంది. స్థానిక వేణుగోపాలస్వామి వీధి, మార్కండేయ దేవాలయ వీధి, అంగడి బజారు, మైసమ్మ వీధి, పోచమ్మ వీధి, అయ్యప్ప దేవాలయం, రామలింగేశ్వర, దుర్గమ్మ దేవాలయం, దేవీ వాసవీ వరవర సంఘం, అంబేడ్కర్ నగర్ ఎల్లమ్మ దేవాలయం, బీడీ కాలనీ, పెద్దమ్మగడ్డతో పాటు పలు ఇతర ప్రదేశాలు, గ్రామాల్లో నిర్వాహకులు నవరాత్రులను చేపట్టారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజా కార్యక్రమాలు, అన్నదానాలు, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో వాడవాడలా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

భవానీ మాలధారణ..

భవానీ మాలాధారణకు దేవీ స్నేహయూత్ అసోసియేషన్ సభ్యులు బీజం వేయగా, తొలిసారిగా 8 మంది మాల ధరించారు. ఏటా మాల స్వాముల సంఖ్య పెరుగుతుండగా, ప్రస్తుత సంవత్సరం 100 మందికి పైగా మాల ధరించారు. కఠినదీక్ష బూని అమ్మవారి నామస్మరణలో తరిస్తున్నారు.

అమ్మవారి అనుగ్రహంతో 23 ఏళ్లుగా నిర్వహణ



23 ఏళ్ల క్రితం మేము నలుగురం కలిసి నవరాత్రులు ప్రారంభించాం. అప్పటి నుండి ఇప్పటివరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నవరాత్రులు కొనసాగిస్తున్నాం. అమ్మవారి అనుగ్రహం మాపైన ఉండటంతో మమ్మల్ని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది నవరాత్రులు నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది.

- పోలోజు వేణుగోపాలచారి, దేవీ స్నేహయూత్ వ్యవస్థాపకుడు


చేర్యాలలో భవానీ మాలాధారణస్వాములు

సిగాచి పరిశ్రమ ప్రమాదానికి నేటికి 90 రోజులు

- పూర్తి పరిహారాన్ని వెంటనే ఇవ్వాలి: సీఐటీయూ


క్యాండిల్ ర్యాలీలో నేతలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెంది, మరో 28 మంది తీవ్రంగా గాయపడిన ఘటనకు నేటితో 90 రోజులు అయ్యింది. ఈ సందర్భంగా పాశమైలారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మృతి చెందిన కార్మికులకు నివాళులర్పిస్తూ, బాధిత కార్మికుల కుటుంబ సభ్యులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ మాట్లాడుతూ, స్వయనా రాష్ట్ర ముఖ్యమంత్రి మృతి చెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం నెల రోజుల్లో అందిస్తామని చెప్పినా, ఇంకా పూర్తి నష్టపరిహారం అందలేదని అన్నారు. ఒక్కొక్క కార్మికుడికి కేవలం రూ.25 లక్షలు మాత్రమే నష్టపరిహారం అందించిందని, ఇంకా రూ.75 లక్షలు అందలేదని అన్నారు. తక్షణమే మిగిలిన నష్టపరిహారం ఒకేసారి ఇవ్వాలి. సిగాచి యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని, యాజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజు, వెంకటేష్, చంద్రయ్య, శ్రీనివాస్, నగేష్, రమేష్, అన్నాజీ, ప్రభు, బాధిత కార్మిక కుటుంబ సభ్యులు రాందాస్, అన్నారి, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక చేనేతలపై షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణ

దుబ్బాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని చేనేత కార్మికుల స్థితిగతులు, రాష్ట్ర ప్రభుత్వం సహకారంపై దుబ్బాకకు చెందిన యువదర్శకుడు వడ్ల కొండ నిఖిల్ నిర్మిస్తున్న షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ మంగళవారం దుబ్బాకలో జరిగింది. ప్రముఖ చిత్రరచయిత, హాస్యనటుడు ఎల్బీ శ్రీరాం ప్రధాన పాత్రధారిగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దుబ్బాక చేనేత కార్మికులతో కలిసి రూపొందించారు. చేనేత కార్మికుడి పాత్రలో ఆయన చేనేత మగ్గాలపై, చేనేత కుటుంబాల నేపథ్యంపై ప్రభుత్వం సహకారంపై పలు చోట్ల సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో చేనేత సంఘం నాయకులు గన్నె రమేష్, సత్యనారాయణ, మద్ది శ్రీనివాస్ కూడా నటించారు. అనంతరం నటుడు ఎల్బీ శ్రీరాం స్థానిక బాలాజీ వేంకటేశ్వరాలయం సందర్శించారు. ఆయనకు ఆలయ కన్వీనర్ వడ్లకొండ శ్రీధర్ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను చూడటానికి దుబ్బాక పట్టణ ప్రజలు తరలివచ్చి, సెల్ఫీలు తీసుకున్నారు.


చిత్రీకరణలో నటుడు ఎల్బీ శ్రీరాం

గీతంలో ముగిసిన బిమ్ వర్క్‌షాప్



పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో రెండు రోజుల బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీఐఎం) వర్క్‌షాప్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. భవిష్యత్తులో ఆర్కిటెక్చర్‌కు అవసరమైన అత్యాధునిక డిజిటల్ డిజైన్ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బిమ్ కేవలం త్రీడీ మోడలింగ్ మాత్రమే కాకుండా, ప్రాజెక్టు ఆసాంతం మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి, వీటిపై పట్టు సాధిస్తే మంచి రూపకల్పనలు రాణించి, అభివృద్ధి పథంలో పయనించవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఏతసీ శాస్త్ర ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన ఈ శిక్షణకు ఆటోడెస్క్ సర్టిఫైడ్ ఇన్‌స్ట్రక్టర్, అనుభవజ్ఞులైన బిమ్ ఇంజనీర్ సతీష్ తన్నీరు నాయకత్వం వహించారు. ఈ వర్క్‌షాప్‌ను గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వి.ఎస్. కీర్తి నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్. ఆకాంక్ష ప్రియదర్శిని సమన్వయం చేశారు.

దుర్గాదేవిగా..

వర్గల్/ మురగంగాం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మంగళవారం విద్యా సరస్వతీ అమ్మవారు భక్తులకు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మురగంగాంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఈ దుర్గాదేవి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వర్గల్ విద్యాధరిలో దుర్గాదేవిగా విద్యా సరస్వతీ అమ్మవారు


కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఏడేళ్లుగా మద్యానికి దూరం..

- ఆదర్శంగా నిలుస్తున్న చెట్ల నర్సంపల్లి
- నాటు అడవి బాట పట్టిన గ్రామం..

నేడు ప్రగతి పథం దిశగా పరుగులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం కారణంగా ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి, అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. నేడు ఏ పల్లెలో చూసినా బెల్ట్ షాపుల జోరుతో మద్యం ఏరులై పారుతుండగా, దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామం మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. ఈ గ్రామం గత ఏడేళ్లుగా సంపూర్ణ మద్య నిషేధాన్ని విజయవంతంగా అమలు చేస్తూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. అప్పట్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువత కలిసి తీసుకున్న కట్టుబాటు ఇప్పటికీ కొనసాగిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

గాంధీ జయంతి రోజున నిషేధ తీర్మానం

2019 అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ వేమ జనార్దన్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత సమావేశమై గ్రామంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. గ్రామస్తులందరూ ప్రతిజ్ఞ చేస్తూ తీర్మానాన్ని అమలులోకి తెచ్చారు. మద్యం అమ్మినవారికి రూ.50 వేలు జరిమానా విధిస్తారు. మద్యం అమ్ముతున్న విషయాన్ని చూసి చెప్పిన వారికి రూ.25 వేల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించారు. సుమారు 900 జనాభా ఉండగా, 584 మంది ఓటర్లు (285 మంది మహిళలు, 299 మంది పురుషులు) ఉన్నారు. మద్యపానం నిషేధం అమలు కారణంగా గ్రామంలో పంచాయితీలు లేవు, పోలీస్ స్టేషన్‌కు కేసుల కోసం గ్రామ ప్రజలు అస్సలు వెళ్లడం లేదు.

అడవి నుంచి అభివృద్ధి ప్రయాణం

చెట్ల నర్సంపల్లి గ్రామం ఒకప్పుడు నక్సలైట్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. ఈ గ్రామానికి చెందిన


మద్యపాన నిషేధంపై తీర్మానం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

మావోయిస్టు పార్టీ అగ్రనేత దుబాసి శంకర్ (అలియాస్ రమేష్, మహేందర్, అరుణ్) 1987లో పీపుల్స్ వార్ పార్టీలో చేరి, కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడిగా ఎదిగాడు. అయితే, 2021 లో ఎదమ కాలికి గాయమై చికిత్స పొందుతున్న శంకర్‌ను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ప్రస్తుతం భువనేశ్వర్ సెంట్రల్ జైల్లో ఉన్నాడు. శంకర్ తప్ప, నేడు గ్రామంలోని యువతరం అంతా వ్యవసాయ, కూరగాయ సాగులో పంటలు పండించుకుంటూ ప్రగతి దిశగా దూసుకుపోతున్నారు.

గ్రామంలో ప్రశాంత వాతావరణం

మహిళలు, యువత, పెద్దలు సమావేశమై గ్రామంలో మద్యం అమ్మకాలు నిషేధిస్తూ తీర్మానం చేశాం. మా గ్రామంలో మద్యపానం నిషేధం ఇప్పటికీ కొనసాగిస్తున్నాం. మండలంలో మా గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవడం మాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది గ్రామంలో మద్యపానం నిషేధం వల్ల ప్రతి ఒక్కరూ తమ పనులు తాము చేసుకుంటూ బిజీ అయ్యారు.

- వేమ జనార్దన్, చెట్ల నర్సంపల్లి గ్రామ మాజీ సర్పంచ్

రసవత్తరంగా అష్టావధానం


అష్టావధానంలో కసిరెడ్డి వెంకటరెడ్డి

కొండపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పద్యం వ్యక్తికి సంస్కారాన్ని, విజ్ఞానాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తుందని సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఉద్ఘాటించారు. మర్పడగ క్షేత్రంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీళ్ల సరస్వతి రామ శర్మ అష్టావధానం రసవత్తరంగా జరిగింది. 'వేదము, నాదము, మోదము, వాదము' అనే పదాలతో అమ్మవారి స్తుతిని దత్తపది పృచ్ఛకులు అడగగా అనుపమ కోరారు. వీరారెడ్డి వర్ణన అంశంగా స్త్రీ శక్తిని వర్ణించమని కోరారు. కట్టారంజిత కుమార్ చందోభాషణం, పద్య అంత్యాక్షరిని వేలేటి శైలజ, ఆశువును జనమంచి వశీంద్ర నిర్వహించారు. అప్రస్తుత ప్రసంగికులుగా గొల్లపల్లి రఘురామ శర్మ తమ ప్రశ్నలతో సభలో నవ్వులు పూయించారు. సభకు క్షేత్ర నిర్వాహకులు చెప్యాల హరినాథశర్మ అధ్యక్షత వహించగా, సింగీతం నరసింహ రావు సభా సమన్వయం చేశారు. అనంతరం అవధాని సరస్వతీ రామశర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేయగలిగినది కేవలం సాహిత్యానికి మాత్రమే ఉందన్నారు. విద్యార్థులకు కనీసం వంద పద్యాలైనా కంఠస్థం చేయించాలని సూచించారు.

రెండు డీసీఎంలు ఢీ.. ముగ్గురికి గాయాలు

జగదేవ్ పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిగడప గ్రామ సమీపంలో రెండు డీసీఎంలు ఢీ కొని ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. మార్కుక్ మండలం పాములపర్తి నుంచి పేడ లోడ్‌తో బయలుదేరిన డీసీఎంను సిరిసిల్ల నుంచి బట్టల లోడ్‌తో మునిగడప వైపు వస్తున్న మరో డీసీఎం ఎదురెదురుగా బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ రవి, మల్లేశం, లక్ష్మారెడ్డి మరో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోగొట్టుకున్న ఫోన్‌లు బాధితులకు అప్పగింత

సిద్దిపేట రూరల్/గజ్వేల్,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీతో రికవరీ చేసి బాధితులకు అప్పగించామని సిద్దిపేట రూరల్ ఎస్ఐ రాజేష్, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ మంగళవారం తెలిపారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్నగుండవెళ్లికి చెందిన ఓ వ్యక్తి, మాచాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బాధితులకు రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను అప్పగించారు. అదేవిధంగా గజ్వేల్‌లోని వివిధ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 12మంది బాధితులకు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ రికవరీ చేసిన ఫోన్‌లను బాధితులకు అప్పగించారు. రికవరీ చేసిన ఫోన్‌ల విలువ సుమారు రూ. 1.80లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

పంటల వివరాలను నమోదు చేసుకోవాలి


ఘనపూర్‌లో పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏవో

నంగునూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు తమ పంటల వివరాలను తప్పనిసరి నమోదు చేసుకోవాలని జిల్లావ్యవసాయ శాఖ అధికారి స్వరూపారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో మండల ఏవో గీతతో కలిసి పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. పంటల నమోదు ఆధారంగానే రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. క్లస్టర్ల వారీగా ఏఈవోలు నమోదు చేసిన రైతుల పంటల వివరాలను ప్రతీవారం రీ వెరిఫికేషన్ చేయనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే ఘణపూర్ గ్రామంలో 15 సర్వే నెంబర్లకు చెందిన రైతుల వ్యవసాయ పొలాలను క్షేత్ర స్థాయిలో పంటలను సందర్శించామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని డీఏవో తనిఖీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా యూరియా పంపిణీ సజావుగా సాగేలా చూడాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ: కలెక్టర్


సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కే. హైమావతి

సిద్దిపేట సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయనున్నట్టు కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, జడ్పీ సీఈవో రమేశ్, అడిషనల్ డీసీపీ కుషాల్‌కర్, డీపీవో దేవకీదేవిలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా జిల్లాలోని 26 మండలాల్లోని 508 గ్రామ పంచాయితీలకు, 4,508 వార్డులలోని పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 26 జడ్పీటీసీ, 230 ఎంపీటీసీ స్థానాల ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లను సిద్ధం చేసినట్టు వివరించారు. గ్రామపంచాయతీ ఎన్నికలను మొదటి విడతలో గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కుక్, ములుగు, వర్గల్, రాయపోల్, దౌల్తాబాద్ 7 మండలాల్లోని 163 గ్రామపంచాయితీలలో, 1,432 వార్డుల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. రెండో విడతలో నంగునూర్, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూర్, నారాయణరావుపేట, మిరుదొడ్డి, బెజ్జంకి, తొగుట, అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక 10మండలాల్లోని 182 గ్రామపంచాయతీల్లోని 1,644 వార్డులలో నిర్వహించనున్నట్లు వివరించారు. మూడో విడతలో అక్కన్నపేట, దూళిమిట్ట, హుస్నాబాద్, కొహెడ, మద్దూర్, కుకునూర్‌పల్లి, కొండపాక, చేర్యాల, కొమురవెల్లి 9మండలాల్లో 163 గ్రామపంచాయతీల్లో 1,432 వార్డులలో ఎన్నికలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను రెండువిడతల్లో 508 గ్రామపంచాయతీల్లోని 4,508 వార్డులలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొదటి విడతతో సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట, చిన్నకోడూర్, నంగునూర్, దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగ్గుట, చేర్యాల, కొమురవెల్లి, రాయపోల్, దూళిమిట్ట, మద్దూర్ మొత్తం 15 జడ్పీటీసీ, 125 ఎంపీటీసీ స్థానాలకు, రెండవ విడతలో గజ్వేల్, కొండపాక, కుకునూర్‌పల్లి, జగదేవ్‌పూర్, ములుగు, వర్గల్, మర్కుక్, హుస్నాబాద్, అక్కన్నపేట, కొహెడ, బెజ్జంకిలలోని 11 జడ్పీటీసీ, 105 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను నిర్వహించనున్నట్లు చెప్పారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, దీనిలో 16 మంది జిల్లా నోడల్ అధికారులు, 92 మంది జోనల్ స్థాయి అధికారులు, 26 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, 126 ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాల్లో అమలులోకి వస్తాయన్నారు. ఎంసీసీ నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను చేపట్టి మండల అధికారులు నివేదిక అందించాలన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు.

నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేసి సిద్దిపేట జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హైమావతి ఎన్నికల జిల్లా నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నియమించిన వివిధ జిల్లా స్థాయి కమిటీలు, జిల్లా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ హైమావతి పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 15 రకాల కమిటీలను వేసి వాటికి జిల్లా నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రతీ నోడల్ ఆఫీసర్ కలెక్టరేట్‌లో ఒక ప్రత్యేక సిస్టం ఏర్పాటు చేసుకొని బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎంసీసీ బృందాలు ఇప్పటి నుంచే చురుగ్గా విధులు నిర్వహించాలని, చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని, ఎలాంటి శాంతి భద్రతల సమస్యల తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ కుశాల్ కర్, జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకి దేవి, నోడల్ అధికారులు డీఆర్డీవో నాగరాజమ్మ, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీసీవో నాగేశ్వరరావు, డీపీఆర్‌వో రవికుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

సిద్దిపేట సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించనున్నట్టు తెలిపారు. మార్గదర్శకాలను ఎవరైనా ఉల్లంఘిస్తే, ఎన్నికలకు సంబంధించి ఇతర ఎలాంటి సమస్యలున్న హెల్ప్‌లైన్ డెస్క్‌లో ఏర్పాటు నెంబర్ 08457-230000 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. లేదంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకు 24 గంటలు ప్రత్యేక సిబ్బంది పని చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో డీపీవో దేవకీదేవి, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఈడీఎం ఆనంద్, హెల్ప్‌డెస్క్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సద్దుల సంబురాలు


ములుగు: నర్సాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సిద్దిపేట రూరల్/ములుగు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండలం జక్కాపూర్, గోపులాపూర్, మాటిండ్ల గ్రామాల్లో సద్దులబతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో చేర్చి మహిళలు, యువతులు చిన్నారులతో కలిసి ఆడిపాడారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అలాగే ములుగు మండలం నర్సాపూర్. కొత్తూరు గ్రామాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నర్సాపూర్ గ్రామంలోని మహిళలందరూ బతుకమ్మలను ఏర్పాటుచేసి గ్రామ కూడలిలో బతుకమ్మ ఆడుతూ మహిళలు సంబరాలు జరుపుకున్నారు.


నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో బతుకమ్మ వేడుకలు

కనుల పండువగా శరన్నవరాత్రులు


సిద్దిపేటలో రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న హరీశ్‌రావు

జిల్లాలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో ఏర్పాటు చేసి మండపాల్లో అమ్మవారి ప్రతిమలను రోజుకో అలంకరణలో భక్తులు దర్శించుకుంటున్నారు. మంగళవారం ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. దుర్గాదేవి మండపాలు, ఆలయాల ఆవరణలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి)


సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని దుర్గామాత ఆలయం ఆవరణలో అన్నప్రసాద వితరణ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


చేర్యాలలో చావడివద్ద అమ్మవారి సామూహిక కుంకుమార్చనలో మహిళలు

నిరుపేద తండా విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు


లకావత్ కల్యాణి

మద్దూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామ శివాలి తండాకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని లకావత్ కల్యాణి ఎంబీబీఎస్ సీటు సాధించి కుటుంబ సభ్యులతో పాటు తండావాసుల అభినందనలు అందుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నిరుపేద కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు లకావత్ జ్యోతి రాజులు ఉపాధి కోసం కరీంనగర్ పట్టణంలో రోజువారి కూలీ పనులు చేస్తూ కల్యాణిని చదివించారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపి నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ నీట్ పరీక్షలో మంచి మార్కులు సాధించి సిద్దిపేట సురభి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించింది. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రయాస్-25 ఫైనల్‌రౌండ్‌కు ఆకునూరు విద్యార్థులు


యశ్వంత్, వర్షిత్

చేర్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీఈఆర్‌టీ ఢిల్లీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ప్రయాస్-2025 జాతీయస్థాయి సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ ఎస్ విద్యార్థులు ఫైనల్ రౌండ్‌కు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన బండమీది యశ్వంత్, ఉడుత వర్షిత్‌లు తమ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు రవీందర్ సహాయంతో ఎగ్జిబిట్స్ ప్రదర్శించగా, నిర్వాహకులు ఇరువురిని ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేశారు.

భవానీ రుద్రేశ్వరాలయాన్ని సందర్శించిన మాజీ స్పీకర్


రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తున్న మధుసూదనాచారి

చేర్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని భవానీ రుద్రేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించారు. దుర్గాదేవికి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఉల్లెంగల సేవాట్రస్ట్ వ్యవస్థాపకులు ఉల్లెంగల పద్మఏకానందం మాజీస్పీకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'దాపటెద్దు' ఆవిష్కరణ

నంగునూరు ,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు చేయూత నివ్వాలనేవారే నిజమైన శాస్త్రవేత్తలని, రైతు సేవకులు, సామాజిక కార్యకర్త పులి రాజు పేర్కొన్నారు. మండలంలోని ముండ్రాయిలో గల వ్యవసాయక్షేత్రంలో మంగళవారం అక్షర సేద్యం ఫౌండేషన్ దశమ వార్షికోత్సవం సందర్భంగా భైతి దుర్గయ్య రాసిన 'దాపటెద్దు' కథల పుస్తకాన్ని ఎడ్లబండి ముందు ఆవిష్కరించారు. అలాగే ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ భైతి దుర్గయ్య రాసిన బాలల కథల పుస్తకం 'అరుగుబడి' ని ఆవిష్కరించారు. అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు వార్షిక నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో నంగునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి, బాల సాహితీవేత్త పెండోట వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది వర్కోలు రాజలింగం, అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలను స్వీకరించిన తహసీల్దార్‌కు సన్మానం


అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్‌ను సన్మానిస్తున్న బక్కివెంకటయ్య

మిరుదొడ్డి,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి):అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన ఎర్రోళ్ల శ్యాంను మండల రెవెన్యూ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శాలువాతో సన్మానించారు. మండలప్రజలకు మెరుగైనా సేవలను అందించాలని సూచించారు. నాయకులు నారాయణరెడ్డి, బుచ్చయ్య, కుమార్, రమేష్, రాజు తదితరులున్నారు.

దేశ సేవకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యం


నంగునూరులో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల కవాతు

చిన్నకోడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ నిర్మాణంలో, సమాజ సేవలో, ధర్మ రక్షణ, దేశ సేవకు ఆర్‌ఎస్ఎస్ ప్రాధాన్యతనిస్తుందని జిల్లా సహ కార్యావహ తిప్పరపోయిన తిరుపతి అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చంద్లాపూర్‌లో నిర్వహించిన విజయదశమి ఉత్సవానికి ఆయన హజరై మాట్లాడారు. పరమ పూజనీయ డాక్టర్ కేశవరామ్ బలిరామ్ హెడ్గేవార్ ఆర్‌ఎస్ఎస్‌ను స్థాపించి విజయదశమి నాటికి 100 ఏళ్ల పూర్తి చేసుకోబోతుందన్నారు. స్వయం సేవకులు పంచ పరివర్తన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు.

● **నంగునూరు:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ధర్మరక్షణతో పాటు సామాజిక సేవలో సైతం ముందుంటుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ అమరేంద్ర ప్రసాద్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నంగునూరులో స్వయం సేవకులు గ్రామ ప్రధాన వీధులలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయుధ పూజ, దసరా ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి):కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అక్బర్‌పేట మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త, ఆత్మకమిటీ డైరెక్టర్ రమేష్ తండ్రి మృతి చెందారు. శ్రీనివాస్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి. జిల్లా కార్యదర్శి కమలాకర్, నాయకులు తదితరులున్నారు.

మాజీ ఎంపీటీసీని పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి

మర్కుక్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీటీసీ గన్నెపల్లి కోటయ్య తల్లి భారతమ్మ మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండా రంగారెడ్డి, ఎంపీటీసీ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఏఎంసీ వైస్ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులతో కలిసి పరామర్శించారు. భారతమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ ఇన్‌చార్జి ఎల్లం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రం ఎల్లం మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో రాయవరం గ్రామానికి చెందిన బీఎస్పీ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి గుర్రం ఎల్లం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిన్న కిష్టాపూర్ ఎంపీటీసీ స్థానం ఎస్సీ జనరల్ కావడంతో పాటు జడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. ఎంపీపీ ఎస్సీ జనరల్ కావడంతో గుర్రం ఎల్లంకు ఎంపీటీసీ టికెట్ ఇచ్చి ఎంపీపీ చేసేందుకు పార్టీలో చేర్పించుకున్నారని తెలుస్తుంది. లేదంటే జడ్పీటీసీ టికెట్ ఇచ్చి ఆ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా చేరిక జరిగినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాగం వెంకటేష్ పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా హుస్నాబాద్ ఎంపీవోగా పని చేస్తున్న రమేష్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ హైమావతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై జిల్లా అధికారులు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించగా ఆతన్ని సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఎంపీవో రమేష్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవీందర్‌రావుకు ఎంపీవోగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అటు..ఇటైతే

(5వ పేజీ తరువాయి)

జనరల్‌కు, మెదక్ జడ్పీని జనరల్‌కు కేటాయించారు. సరైన అభ్యర్థుల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ముఖ్యనేతలు ఆరా తీస్తున్నా ఎక్కడో ఒక మూలన రిజర్వేషన్ల మార్పు అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులపైనా ఇదే నిర్ణయం తీసుకోనున్నారు. ఆశావహులు తమ అభ్యర్థిత్వం కోసం ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అందరికి కూడా వారం తర్వాతనే అంటూ సమాధానం వస్తున్నది.

అందరినోటా ఇదేమాట..

హైకోర్టు తీర్పుపైనే ఆశావహుల భవితవ్యం ఆధారపడింది. రిజర్వేషన్ల లెక్క తేల్చినప్పటికీ పోటీ చేసేందుకు మాత్రం ఎవరు కూడా ముందడుగు వేయడం లేదు. అన్ని గ్రామాల్లోనూ ఇప్పుడు రిజర్వేషన్ల విషయమే హాట్ టాపిక్‌గా మారింది. ఎవరినోట విన్నా ఇదే చర్చ జరుగుతోంది. హోటళ్లు, ధాబాలు, బెల్టుషాపులు, గ్రామాల్లోని పలు అడ్డాల వద్ద రిజర్వేషన్ల గురించే మాట్లాడుకుంటున్నారు. అక్కడక్కడ మాత్రం పూర్తి నమ్మకంగా ఉన్నవారు విందులు ఇవ్వడం ప్రారంభించారు. గ్రామాల్లోని పెద్దమనుషులు, కుల సంఘాల ప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

జీజీహెచ్ కంపు కంపు

(5వ పేజీ తరువాయి)

తరలించకుండా ఆవరణలోనే జమ చేస్తుండటాన్ని గుర్తించిన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ గతంలో ఆసుపత్రి పారిశుధ్య నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు భారీ జరిమానా విధించారు. అయినప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు, సిబ్బంది తీరు ఏమాత్రం మారడం లేదు. పారిశుధ్య నిర్వహణలో లోపం స్పష్టంగా కనిపిస్తుండటంతో, ఆసుపత్రిలో చేరిన వారిని చూసేందుకు వచ్చిన రోగుల సహాయకులు సైతం రోగాల పాలయ్యేలా పరిస్థితి తయారైంది. ఆసుపత్రి అధికారులు మేల్కొని, హానికర చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.